కథ

పాగల్ యల్లమంద

'కిరణ్'

ఊరు చేరేప్పటికి కోడికూసింది. కొందరు యిళ్ళకు బోయి కావళ్లేసుకున్నారు. కొందరు ఊరు మొగదలే కొట్లాల్లో ఎడ్లను నీళ్ళకొదిలి అరకలూ, పగ్గాలూ సర్దుతున్నారు. ఊరవతల భాగంలో ఇళ్ళకువెళ్లే వాళ్లు చాలామంది బొడ్రాతిదగ్గరనిలుచుని మాట్లాడుకుంటున్నారు.

"దాదా, అంత ముసలోడు! ఎట్లా పోట్లాడిండురా!"

"శీతమ్మను, శీతమ్మో! అబంసుబం ఎరుగదుగదా, ఎంత ధైర్యమొచ్చింది. పోలీసోడి బుర్ర బగలేసిందిగదా! ఆ రోకలి బండ దొరికినందుకనుకోవాలి!"

"అబం సుబం యెరక్కపోతేమట్టుకు యేంజేస్తుంది. పిల్లి సహా ఎటూ వీల్లేకపోతే ఎగిరి మీదకు కమగబట్టుతేగారి!"

"అబ్బో, కమలంటే కమలా, యేం పాటలు, యేం ఉపన్యాసాలు— జనాన్ని కదలేసిందనుకోండ్రి. వీరారెడ్డి అట్ల తయారు జేశిండు."

"అబ్బ! దాదా, శీతమ్మ! వాళ్ల పొట్టని బెట్టుకున్రను, రాక్షసి ముండాకొడుకులు. వాళ్ళదగ్గర తుపాకులు లేకపోతే గినకనా?

"అయితే యేం? మనోళ్ళే గెలిచినారు. వీరారెడ్డిని జైలునుంచి యిడిపించుకున్రి. దేశముఖు గాడు కుక్కవాలె పారిపాయె.

"ఆ మస్తాను గాడికీ పటేలు గాడికీ భలే తన్నులు తగిల్నాయి ఆ కుక్కల్ని ఊళ్ళోనుంచి తరిమేస్తిరి."

యల్లమందంటే యల్లమందా: మస్తాన్ గాడు తిన్న దేవరపోతును కక్కేశిండు. కశంటే అది. అట్లుండాలి.

"ఇదంతెందుకు? గెలిచాము! వాళ్ళ సేలువాళ్లు మళ్లీ దున్నుకుంటున్నారు. మన సేలు మనకొచ్చేదెప్పుడో?"

"ఏమో! సంందయ"

అందరూ ఇలామాట్లాడుకుంటున్నారు.

గొల్లబోయన్న యేమీ మాట్లాడ్డంలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"ఇప్పుడయ్యిందేంద్రి? పోరాదిరి? పొద్దెక్కుతుండది" అన్నాడొక ముసల్ల

రైతు ఎవరిళ్ళకు వాళ్లు బయలుదేరారు. ఇంతలో —

"పోలీసులు! పోలీసులు!" అని కేకలు.

ఆ మృగాలప్పుడే అరుస్తూ లాఠీలు తిప్పుకుంటూ యిళ్ళమీద పడ్డారు.

"ఏయ్! దర్వాజా ఖోల్!" ఒక్క తన్నుకు ఒక యింటితలుపు బ్రద్దలైంది.

"గింజల్! హోక్డాంభపానేశావ్! బోలో సువర్!" ఒక ముసలిరైతు నడుంవిరిగింది మరోయింట్లో.

యీ గందరగోళానికి భయమెత్తి, బుట్టలక్రింద కుదకుదలాడుతో రెక్కలు కొట్టుకుంటూన్న కోళ్లను "యీకుక్కలెత్తకపోతారనుకుంటూ" వదలిపెట్టుతూంది ఒక ముసలమ్మ.

"ఏయ్‌బూఢీ! ముర్గీకో..." ఒక్క తన్నుకు ముసలమ్మ బుట్టలమీదుగా పిల్లింతేసింది.

"నీమొగ్గు హోక్డాసచ్చాడ్? బోలో!" ఒక యువతిని జుట్టుపట్టుకని బైటికి లాక్కొచ్చారు మరోయింట్లోనుంచి.

"దానిక్కొ మొగ్గు క్యోంరే?" అంటూ నల్గురు పోలీసులు పెనుగులాడుతూన్న ఆశీలవతిచుట్టూ చేరారు.

అరుపులు, పెడబొబ్బలు, బూతులు, ఏడుపులు అంతా భీభత్సంగా వుంది. బొడ్రాతిదగ్గర జనం అంతా ఒక్కమారుగా పరుగెత్తబోయారు. "ఆగ్రి" ఖంగున అరిచాడు బోయన్న. గొర్రెమేతకుకొమ్మలు నరికే కత్తిదోటీ పైకెత్తి నిలుచున్నాడు బోయన్న. జనంఅంతా ఠక్కునఆగారు.

"ఎక్కడికి పరిగెత్తేది? పదిమంది పోలీసోళ్లొత్తే పారిపోతారు! ఆడోళ్లను నూసినా సిగ్గులేదారి?" అని అరిచాడు.

జనం గిరుక్కున వెనక్కు తిరిగింది. ఆయువతిచుట్టూ చేరిన పోలీసులను చుట్టుముట్టారు, పట్టరాని క్రోధంతో తిరుగుతూ. లాఠీలకు మెసులు చాటుకాలేదు. శరీరాలు హూనాణమై పోతున్నాయి. బోయన్న దోటీ పక్కవాటుగా లేచింది. దోటీ కత్తి రివ్వుమన్నది యింద్రధనుస్సులా మెరిసింది ఒకపోలీసు మెడకాయ సగంతెగింది.

మిగిలిన పోలీసుల లాఠీలూ, టోపీలూ, అక్కడే ఉన్నాయి. దూరంనుంచి "రేపు మీ పని" అని కేక వినపడ్డది.

* * *

ఆవూరివాళ్ళను నలభైమందిని ఒకపగ్గానికి కట్టి తాలూకాకీడ్చుకొచ్చారు. చుట్టూ యాభైమంది రిజర్వు పహారానిల్చున్నారు. తుపాకుల సన్నీలు నాల్కలు గోరుతున్నాయి. బల్లమీద రివాల్వరు. చేతులో హంటరుతో యిన్స్పెక్టరు. పొడగాటి కొరడాలతో యిద్దరు గూండాలు నిలుచున్నారు. పక్కన ఆ వూరిపటేలు చేతులు కట్టుకుని ఉన్నాడు.

"పోలీసును చంపిందెవరురా?" యిన్స్పెక్టరు మొరిగాడు. ఎవరూ మాట్లాడలేదు.

"ఊఁ, బోల్తా హై? నహీ?" యెవరూ మాట్లాడలేదు.

ఇన్స్పెక్టరు పటేలుకు సైగచేశాడు. పటేలు లిస్టులోంచి పేర్లు చదవడం మొదలెట్టాడు.

"వెంకటరెడ్డి...!"

పోలీసుల కొరడాలు అతని శరీరంపై చటుల్, చటుల్ మోగుతున్నై. ఇన్స్పెక్టరు రివాల్వరు గురిపెట్టాడు.

"అభీ! బోలో!"

'నాకు తెలియదు'?

రివాల్వరు క్లిక్కుమన్నది. ధామ్మని ప్రేలింది. కాసేపటిలో ఆరు గుళ్ళు పేలినయి. ఆరుశవాలు పడ్డయ్. "ఛీ! గుళ్ళయిపోయినై." అంటూ రివాల్వరును బల్లమీద పడేశాడు.

పటేలు పేర్లు పిలుస్తూనే వున్నాడు.

ఒక్కొక్కరికీ కొరడాలతో శరీరాలు బద్దలైనవి. నెత్తురు ఓలలైనవి. కాని యెవరూ "మాకు తెలియదు" ఒకటేమాట.

పోలీసులకూ, యిన్స్పెక్టరుకూ విసుగెత్తింది; అలుపొచ్చింది. "షాండి! సుకర్ ఖాంచేత్! తరవాత చెప్పిస్తా. కొట్లో తోయ్యండిరా వీళ్లని," అన్నాడు.

"బోయన్న!"

పటేలు చివరిపేరు చదివాడు.

బోయన్న కదలలేదు. తనను గాదన్నట్లు. "అరే! నిన్నేరా! అని వెనకనున్న పోలీసు బూటుకాలితో ఒక్క తన్ను తన్నాడు.

"ఓయ్! నాపేరు బోయన్న గాదోరి" తల వెనక్కుదిప్పి విదిలించాడు. తన్నిన తాపుకు రెండడుగులు ముందుకు బడ్డై.

అరే! బద్మాష్! పిలిస్తే, రావ్! బోషడీ!" ఇన్స్పెక్టరు హంటరుపిడితో దెబ్బమీద దెబ్బ వేశాడు. బోయన్న తొణకలేదు. దెబ్బలు తగిలినచోట నిమురుకోనైనా లేదు.

"నువు పిలిచింది బోయన్న గాదుర్రి"

"హరే! నిన్నే! సువర్" హంటరుపిడి బోయన్న ఒంటిమీద విరిగి అంత దూరాన యెగిరిపడ్డది.

ఈసారి పోలీసు కొరడాలు పర్రుమన్నై. బోయన్న పోలీసులవైపు కూడా చూళ్లేదు. ఎర్రనికళ్లు ఒకటి పటేల్ను, ఒకటి యిన్స్పెక్టరునూ మింగేస్తున్నై. ఉద్రేకంగా-

"నా పేరు యల్లమంద" అన్నాడు.

పోలీసుల గుండెలు కలుక్కుమన్నై. పటేలూ, యిన్స్పెక్టరూ తుళ్ళిపడ్డారు. కొరడాలతో కొడ్తూనే ఉన్నారు.

"మా పోలీసును చంపిందెవర్రా?"

"నేనే"

ఇన్స్పెక్టరుకూ, పటేలుకూ ఆశ్చర్యం, భయం. శరీరాలు జల్దరించినై. మిడిగుడ్లు పడ్డై.

"నువ్వైతే యల్లమందా వేరా" యల్లమంద గూబ గుయ్ మన్నది. లాఠీదెబ్బలకు ఒళ్ళంతా కదుములు కడ్తున్నది. కొరడాలు చర్మాన్ని ఒలిచేస్తున్నవి.

"మొన్నా యల్లమందను కొడితే బయపడిపోయి యేలుముద్రేశిండు. నేన్లాపిరకపడతాననుకుండరేం! నామర్దా!

దెబ్బలు పడుతూనే ఉన్నై. పెడరెక్కలు విరిచేస్తున్నారు. బోయన్న "నేనే చంపినా! నేనే! నేనే!" అని అరుస్తూనే ఉన్నాడు.

ఇన్స్పెక్టరు జీవితంలో ఒకేఒక్కసారు మానవ సహజమైన ఆలోచనలో పడ్డాడు.

'వాళ్లంతా మాకు తెలియదన్నారు. వీడు నేనే నంటాడు. ఎంత హింసించినా నేనే నంటాడు. వీడు పాంగల్ కాడుగదా.'

పటేలు "వీడికి పిచ్చెంది" మెల్లిగా అన్నాడు. ఇన్స్పెక్టరుకు పిచ్చి అన్న అభిప్రాయం దృఢపడ్డది.

"తహర్ రే! వీణ్ణి వదిలేయండి"

"వదిలేశ్రుగినా! ఇంకో పోలీసోణ్ణి నరుకుతాడ్రి."

పోలీసులకు రేచిక్కొంత్తింది. అలు పొచ్చిందాకా కొట్టారు. గసపెడుతూ "ఫోరా! పాంగల్" అని లేవదీసి అవతలికి పడేట్టు ఒక్కతన్ను తన్నారు.

"ఆ! పాంగల్! నైజాం యములోళ్లను నరికే పాంగల్" శరీరంలో మిగిలిన సత్తువనంతా చిక్కబట్టి అరిచాడు బోయన్న.

* * *

తాలూకానుంచి ఆ వూరుకు బోయె డొంకను మరోడొంక అడ్డంగా దూసుకు పోతూంది. రాత్రి ఎనిమిది గంటలౌతుంది. "ప్రజాసైన్యం" ఒక ఏభైమంది వుంటారు. ఆ డొంకనె నడుస్తూన్నారు. చీకటిగా వుంది. ఎవరూ మాట్లాడటంలేదు కూడలి కొచ్చేప్పటికి శ్రేణి ప్రక్కనే నడుస్తున్న దళనాయకు డకస్మాత్తుగా ఆగాడు. కూడలిలోఎదో కదిలినట్లనిపించింది. కాని కదలలేదు. దానిమీద సరిగ పైనుంచి టార్చి వేశాడు. మనిషి. స్పృహలేదు. శరీరం కాలిపోతూంది. నాయకుడు బుజాన తగిలించిన నీటిసీసాలోంచి చల్లని నీరు కొంచి ముఖాన చల్లాడు. అతడు కొంచెం కదిలాడు. పా...గల్—యు...ల్ల...మంద"...కలవరించాడు. ఎండి పిడచ గట్టిన నోట్లో కొంచెం నీళ్లు జార్చాడు నాయకుడు. అతను కళ్లు తెరిచాడు. ఇంకొంచెం నీరు తాగించిన తరవాత మగత తెలిసినవాడులాగ గభాలున లేచి కూచున్నాడు. "పాంగల్! యుల్లమంద! నైజాం యములోళ్లను నరికే పాంగల్! పోవాలె; మా యీరారెడ్డియ్యకు సెప్పవాలె." అంటు లేవబోయాడు. దళనాయకుడర్థం చేసుకున్నాడు.

"నేనే! వీరారెడ్డిని! యేంజరిగిందేమిటి?"

"నువ్వా! మా యీరారెడ్డియ్యవా నువ్వు. అయితే పంచె, చొక్కా, కండువా యెక్కడుండయ్యి. కమలమ్మేది? యేమో ఉంహు...."

"కాదు. యుల్లమందా! మన ప్రజాసైన్యం జైత్రయాత్ర బయలుదేరింది."

"అంటే"

"అంటే నైజాం యములోళ్ళపైన యుద్ధంజేయటానికి మనమంతా సైన్యంగా తయారైపోతున్నాం."

"మొన్న యియ్యాల్లో, అప్పుడే సైన్యం గూడా తయారుజేసిరారి. అదిగది, మా యీరారెడ్డియ్యంటే అంతే!"

"ఇంతకూ సంగతేమిటి చెప్పవూ!"

"మనూరోళ్ళను, పోలీసునాయాళ్ళు జైల్లోపెట్టినారు. ఆపోలీసోణ్ణిచంపింది నేనే అంటే "పోరాపాగల్"అని గెంటేశ్రు. నేను, పాంగల్! నైజాం యములోళ్ళను నరికే పాంగల్."

"ఎంతమందిని జైల్లోపెట్టారు."

"ఆఁ! మన దేశముఖు లాడీసులుయెత్తుకపోయిన నామందలోసగం ఉంటారు.

ప్రజాసైన్యం మలుపు తిరిగి తాలూకా వేపుకు నడిచింది. "ఏదన్రా, నాదోటి నువ్వు దీసుకుండవ్" అని పక్కనున్న ఒక సైనికుడు దగ్గర గండ్రగొడ్డలి లాక్కొని తన బుజానబెట్టుకొని నడుస్తున్నాడు బోయన్న.

అర్ధరాత్రి బీటుమారే టైమైంది. రిజర్వంతా. ప్రజాసైనికుడొకడు వెనకవేపు నుంచి చప్పుడు చేయకుండా గోడదిగి రిజర్వ్వేపుకు ప్రాకుతూన్నాడు. ప్రక్క నుంచి బిల్డింగు చుట్టూ దిరిగి మర్లొకరు పహారా జవానుకు వెనకగా చేరుకుంటున్నాడు,

"ఖడ్ రహో! కోన్ హై...?" అని అరిచాడు పహరాజవాను. ఎప్పుడుచేరాడో వెనకనుంచి "యల్లమంద!" అని బిగ్గరగా అరిచాడు బోయన్న. జవాను కంగారు పడ్డాడు. వణుకుతూన్న చేతులనుంచితుపాకి కిందపడ్డది; ఇక చేతినుండ నన్నట్టు శబ్దం చేసింది. రిజర్వు కలవరపడిలేచింది. చేతి బాంబొకటి వాళ్ళ మధ్యన ప్రేలింది. బోయన్న "నైజాం యములోళ్ళను నరికే పాగల్" అని అరిచాడు. గండ్రగొడ్డలి పరిగెత్తబోయే పహరాజవాను తల నరికింది. "ఆంధ్ర మహాసభకు జై!............" యాభై గొంతులనూ బిల్డింగు అదరిపడి ప్రతిధ్వనించింది. రిజర్వికలేదు. మూడు శవాలు, పది కూటిశరీరాలు, ఏభై తుపాకులు, యాభైజతలబూట్లు, పట్టీలు ఇతర సరంజామా మిగిలినై.

గండ్రగొడ్డలి దెబ్బకు తాళాలు పగిలినై. "ఆంధ్రమహాసభకు జై"—తొంభై గొంతులు ఆకాశానికి లేచినై.

"దేశముఖు - పటేలు!" అన్నారు వాళ్లు ప్రయత్నంగా. ప్రజాసైన్యం తమ, కొడవళ్ళూ, కర్రలూ, యీటెలూ విముక్తిచేసి తమలోకి తెచ్చుకున్న వాళ్లకిచ్చారు.

ఏభై తుపాకులూ తమ బుజాల కెత్తుకున్నారు. ప్రజాసైన్య మిప్పుడు తొంభైమంది. బిల్డింగుకు నాలుగు మూలలా నిప్పంటించి ముందుకు సాగారు ఆ వూరి వైపు. వెనుక మండుతున్న బిల్డింగుమంటలు తుపాకి సన్నీల జేగురు కాంతుల్తో తళతళలాడించినై.

ప్రజాసైన్యం వూరు ముంగిటికి చేరుతూంది, "పదండిరా, పదండిరా పదండిరా!

పగలూ రాత్రి కష్టించి భూములను
పగలమున్ని పండించుటకై"

పాట ఊరినిశ్శబ్దాన్ని ఛేదించింది.

గడీ అంతా "ప్రజాసైన్యం!" "జైత్రయాత్ర!" అని ఒక్కమారు త్రుళ్ళిపడి ఆవులించింది.

దేశముఖు కారేసుకుని వెనకదోవన పారిపోయాడు.

ప్రజాసైన్యం ఊళ్లో ప్రవేశించింది. పటేలు నిద్రమంచంమీదనుంచి లేచి త్రుళ్లిపడి బయటకు పరుగెత్తాడు.

"అడుగో పటేలు" అన్నారంతా

"పట్టుకోండి! ప్రజలకోర్టులో విచారిద్దాం"అన్నాడు దళనాయకుడు. దళనాయకుని మాట ముగిసేలోపలనే. బోయన్న చేతులో గొడ్డలి 'రంయ్'

మున్నది. పటేలు తల తెగిపడ్డది. "యల్లమంద! పాగల్! నైజాం యములోళ్ళను నరికే పాగల్; పారిపోయినోడివి, మళ్లొచ్చినారి." అని అరిచాడు బోయన్న.

"పటేలు కదేశిత" అన్నారు ప్రజలంతా బిడ్డలూ, స్త్రీలూ, వృద్ధులూ అంతా ఒక్క గొంతుకతో.

దళనాయకుడు బొడ్రాతి అరుగెక్కాడు. సోదరులారా "ఇక మీ భూములు మీరు తీసుకోండి" ప్రకటించాడు.

అందరూ "మా భూమి" అన్నారు సంతోషంతో.

"బోయన్నా! దేశముఖు - కాదు - మనదొడ్లల్లో నీ మందెక్కడుందో చూసుకోమని" ఒక వృద్ధరైతు కేకేశాడు.

అటు ఓనవతల నిశ్చలంగా శాంతంగా నిలుచుని ఉన్న బోయన్న దృష్టి ఆ రైతు కేసి తిప్పాడు. "అం" అని పలకబోతున్నట్లు నోరు తెరిచాడు స్పృహతప్పింది.

★

పాఠకులకు మనవి

అభ్యుదయలోని రచనలనుగురించి ప్రతినెల పాఠకులు తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. వానిలో ముఖ్యమైనవాటిని ప్రకటిస్తున్నాము.

ఈ 'లేఖలు' శీర్షికలో వీలైనంత ఎక్కువమంది పాఠకులు పాల్గొనవలెనని కోరుతున్నాము. ప్రతినెల పాఠకులు ప్రతిరచనపైన తమ అభిప్రాయాలను సమగ్రంగా సంగ్రహంగా తెలుపుతూ, పత్రికా నిర్వహణను ఒక సమిష్టియత్నం చెయ్యమని కోరుతున్నాము.

సంపాదకులు

'అభ్యుదయ'